## క్లుప్తంగా

### శ్రీ మఠంలో అమావాస్య పూజలు



మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం అమావాస్య సందర్భంగా మూలబృందావనానికి పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథాలపై ఊరేగించారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆదోని అర్బన్ : పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో భారతదేశ ఎన్నికలు – ప్రజాస్వామ్యంలో యువత పాత్ర అనే అంశంపై ఉపన్యాస పోటీలను కూడా చేపట్టారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ ధరకే ఇసుక ఇవ్వాలి

ఆదోని అర్బన్ : పట్టణంలోని బైపాస్ రోడ్డులో ప్రభుత్వం నిల్వ ఉంచిన ఇసుక రీచ్ వద్ద ట్రాక్టర్ల యజమానులు శనివారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారమే ఇసుక ఇవ్వాలని కోరారు. కౌతాళం మండలంలో ఒక ధర ఉంటే గుడికంబాల వద్ద మరొక రేటు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌతాళం మండలంలో టన్ను ధర రూ.475 ఉంటే గుడికంబాల వద్ద రూ.845గా విక్రయిస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకే ఇసుక సరఫరా చేయాలని వారు కోరారు.

### ఘనంగా శత జయంత్యుత్సవాలు



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగ స్వామి

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఫారెస్ట్ లైన్ అంబా భవానీ దేవాలయంలో వెలసిన శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి శత జయంతి మహోత్సవం అంబాభవానీ సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివార్లకు కాగడ హారతి, తులసీ అర్చన, పంచామృతాభిషేకం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ఏకాహ్నిక విట్టల విట్టల నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఈ భజనలు ఆదివారం ఉదయం 6 గంటల వరకు నిర్వహిస్తారు. అదే రోజు ఉదయం పురవీధుల్లో భజన, కంచి మేళతాళాలతో స్వామివారి పల్లకీ సేవ జరుగుతుంది.

### చికెన్ వ్యాపారులు శుభ్రత పాటించాలి

ఆదోని అర్బన్ : చికెన్ విక్రయదారులు మాంసంపై దుమ్ము, ధూళి, ఈగలు వాలకుండా పరిసరాల శుభ్రత పాటించాలని, అలాగే మాంసంపై గాజు పెట్టి ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో చిన్నమార్కెట్ చికెన్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా వ్యాపారం చేసుకోవాలన్నారు. అలాగే పాత పోస్టాఫీసు, హవాన్నపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. శానిటేషన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### మౌంట్ కార్మెల్ కమర్ స్కూల్ ప్రారంభం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వై.సీతారామిరెడ్డి


మంత్రాలయం రూరల్: మండలంలోని సుంకేశ్వరి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన మౌంట్ కార్మెల్ కమర్ స్కూల్‌ను వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మంత్రాలయం, కోసిగి మండల ఇన్‌చార్జ్‌లు విశ్వనాథ్‌రెడ్డి, మురళీరెడ్డి పాల్గొన్నారు. వారిని నిర్వాహకులు సన్మానించారు.

### రోడ్డుకు మరమ్మతులు చేయండి

ఆదోని రూరల్ : మండలంలోని జాలిమంచి గ్రామానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, రోడ్డుకిరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం వారు గ్రామస్తులతో కలిసి నిరసన తెలియజేశారు. సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడుతూ పాండవగల్ నుంచి జాలిమంచి క్వారీ వరకు రోడ్డు గుంతలు పడి తిరగడానికి వీలు కానట్లుగా మారిందన్నారు.

# కల సాకారమయ్యే వేళ..

- కోసిగికి తీరనున్న తాగు, సాగునీటి కష్టాలు
- ఎత్తిపోతల పథకానికి నేడు భూమి పూజ చేయనున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



నిండుకుండను తలపిస్తున్న పులికనుమ రిజర్వాయర్

కోసిగి: మండల కేంద్రంలో ఏళ్లుగా కొనసాగుతున్న సాగు, తాగు నీటి కష్టాలు తీరనున్నాయి. వైఎస్సార్ పులికనుమ రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేయగా.. కోసిగి సమీపంలో దాదాపు 800 ఎకరాల విస్తీర్ణంలో 1.4 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించారు. భూములు కోల్పోయిన కోసిగి ప్రాంత వాసులకు సాగు నీరివ్వకుండా దిగువకు తీసుకెళ్తున్నారు. దీంతో దిగువ ప్రాంత భూముల్లో సిరులు పండుతుండగా.. ఇక్కడి భూములు బీడుగా మిగిలిపోవడంతో ప్రజలు వలస బాట పడుతున్నారు. సమస్యను గుర్తించిన ప్రభుత్వం పరిష్కరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కోసిగి ఎత్తిపోతల పథకం నిర్మించాలని చర్యలు చేపట్టింది.

#### హామీ నెరవేర్చి..

2019 ఎన్నికల ప్రచారంలో కోసిగిలో పర్యటన సందర్భంగా పులికనుమ నుంచి తాగు, సాగునీటి ఇవ్వాలని రైతులు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని, ఆయన తనయుడు వై.ధరణీధర్ రెడ్డిని కోరారు. గెలిపిస్తే హామీ నెరవేరుస్తామని మాటిచ్చారు.

#### ఎత్తిపోతల పథకానికి నేడు భూమి పూజ..

కోసిగికి తాగు, సాగునీటిని అందించేందుకు పులికనుమ రిజర్వాయర్ సమీపంలో ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదివారం భూమి పూజ చేయనున్నారు. పులికనుమ మిగులు బడ్జెట్ రూ.4.80 కోట్లతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. పులికనుమ పంపింగ్ పైప్‌లైన్ నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి 20 క్యూసెక్‌ల నీటి వినియోగానికి 2.2 అడుగుల పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో కోసిగి, పెండేకల్లు, నాకన్న చెరువు, నేలకోసిగి ప్రాంతాల్లోని 2,800 ఎకరాలకు సాగునీరందేలా ప్రణాళిక రూపొందించారు.



ఎత్తిపోతల పథకానికి భూమి పూజ చేయనున్న ప్రాంతం

#### సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌గా భూగేని చెరువు..

ఎమ్మెల్యే సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి ఎత్తిపోతల పథకం మంజూరు చేయించారు.

కోసిగి శివారులోనున్న భూగేని చెరువు 16 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇన్నాళ్లు ఒట్టిపోయి, ముళ్ల పొదలు పెరిగి నిరుపయోగంగా ఉండింది. ప్రస్తుతం రూ.36 లక్షలతో మరమ్మతులు చేసి సమ్మర్ స్టోరేజీగా మారుస్తున్నారు. అక్కడ ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేసి కోసిగికి తాగునీటిని సరఫరా చేయనున్నారు. పనులను పద్మ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో 9 నెలలోగా పూర్తి చేయనున్నారు. దీంతో తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం లభించనుంది. తమ ఏళ్ల నాటి కల సాకారమవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

### హైకోర్టు తీర్పును నిర్లక్ష్యం చేయడం తగదు

ఆదోని అర్బన్ : హైకోర్టు తీర్పు పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విరాట్ హిందుస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని హిందూ దేవాలయాలు, ధార్మిక సంస్థలు, ఆస్తుల పరిరక్షణలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పెద్దతుంబళం రామాలయంలో ఆక్రమణలు తొలగించాలని 2017లో హైకోర్టు ఆదేశించినా ఇప్పటివరకు చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. అలాగే పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి, శివాలయం ప్రాంగణంలో అక్రమాలు జరిగినా చర్యలు తీసుకోవడంలేదని, కొన్ని ఆలయాలకు భూముల రికార్డు తారుమారయ్యాయని కోర్టు ఆదేశించినా చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. సంవత్సరాలు గడిచినా తహసీల్దార్ పరిష్కరించడంలేదని, ఇలాగే వ్యవహరిస్తే సీసీఎల్ఏ అధికారికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నరసింహులు, మహేంద్ర రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం కృష్ణమూర్తి, పీడీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 విభాగంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం పుల్లారెడ్డి, పీఈటీ శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు



రోడ్డు భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ, అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపటం తదితర మానవ తప్పిదాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, డీటీసీ శ్రీధర్, డీఎస్పీ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆర్టీఓ శివారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీఓ కార్యాలయం వద్ద 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు లారీ యజమానులు, డ్రైవర్‌లు, క్లీనర్‌లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు బైకులు కొనిచ్చి వారి జీవితంతో ఆడుకుంటున్నారన్నారు. నియమ, నిబంధనలు పాటిస్తే రహదారి ప్రమాదాలను కొంతమేర తగ్గించవచ్చన్నారు. ప్రతి వాహనదారుడు కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలన్నారు. 2020–21లో జిల్లాలో 1,185 రోడ్డు ప్రమాదాలు జరుగగా 620 మంది మరణించారని, 1,300 మంది క్షతగాత్రులుగా మారారని డీటీసీ తెలిపారు. అలాగే 2021–22 నవంబర్ వరకు 852 మంది రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 800 మంది క్షతగాత్రులయ్యారని, 400 మంది మృతిచెందారని వివరించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఇన్సూరెన్స్ అధికారి మూర్తి, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు బుసిరెడ్డి, లారీ ఓనర్‌లు, డ్రైవర్‌లు పాల్గొన్నారు.

### ముత్తుకూరులో ఘర్షణ

ఆస్పరి: ముత్తుకూరు గ్రామంలో చోటు చేసుకున్న ఘర్షణలో ఆరుగురు గాయపడ్డారు. శనివారం ఆలూరు సీఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ గ్రామానికి చెందిన లక్ష్మన్న, వెంకటేష్ కుటుంబాల మధ్య పొలం రాస్తా విషయంలో శుక్రవారం రాత్రి పరస్పరం దాడులు చేసుకోవడంతో వెంకటేష్, హనుమంతు, లలితమ్మ, నాగలక్ష్మి, లక్ష్మన్న, బీరప్ప గాయపడటంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

# జాలవాడిలో గుడిసె దగ్ధం



ఆర్థిక సాయం అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి



మంటల్లో కాలిపోయిన పత్తి, సరుకులను చూపుతున్న బాధితుడు బజారి

పెద్దకడబూరు : ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు అంటుకుని దగ్ధమైన సంఘటన మండలంలోని జాలవాడి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు కురువ బజారి, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. బాధితుడు బజారి చెల్లెలు నిర్మిస్తున్న కొత్త ఇంటి పనినిమిత్తం అందరూ ఆమె ఇంటికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు మంటల చెలరేగి పొగలు వస్తుండటంతో చుట్టుపక్కల వారు గమనించి బజారికి సమాచారం చేరవేశారు. వారు మంటలను అదుపుచేసేలోపు పూర్తిగా కాలిపోయింది. గుడిసెలో నిల్వ ఉంచుకున్న దాదాపు 15 క్వింటాళ్లకు పైగా పత్తి కాలి బూడిదైంది. అలాగే 4తులాల బంగారం, రూ. లక్ష నగదు, నిత్యావసర సరుకులు, చెల్లెలు ఇంటి ఓపెనింగ్ కోసం తెచ్చిన కొత్త బట్టలు సహా కాలిపోయాయి. దీంతో బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితుడి వివరాలను తెలుసుకొని ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని సూచించారు. అలాగే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దారు వీరేంద్రగౌడ్, ఆర్ఐ మహేష్ బాధితుడిని కలిసి వివరాలు సేకరించి ఎమ్మెల్యే అందజేసి రూ.10వేలు, క్వింటా బియ్యం, కందిబ్యాళ్లు అందజేసి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

# ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



వెండి అలంకరణలో స్వామి వారు



భక్తులతో కిటకిటలాడుతున్న క్షేత్ర ప్రధాన రహదారి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం శనివారం అమావాస్య కావడంతో భక్తులతో కిటకిటలాడింది. తమ ఇంటి ఇలవేల్పును దర్శంచుకోవాడానికి వేలాదిగా తరలి వచ్చారు. శుక్రవారం సాయంత్రం నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి. స్వామి వారి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహా మంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి అనుమతించారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో భక్తులు గంటకుపైగా నిరీక్షించాల్సి వచ్చింది. పలువురు అక్కడే పిండివంటలు వండి స్వామికి నైవైద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటక రాష్ట్రం రాయచూరు, శిరుగుప్ప, బళ్లారి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

#### రామలింగేశ్వర స్వామి దేవాలయంలో..

మేళిగనూరులో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వర దేవాలయం శనివారం భక్తులతో పులకించింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అలాగే.. సుళేకేరి గ్రామ శివారులో వెలిసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకుంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

### బాల్య వివాహాలను అరికడదాం

ఎమ్మిగనూరు రూరల్: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సీడీపీఓ సఫర్నీసాబేగం అన్నారు. శనివారం మండల పరిధిలోని గుడేకల్ జిల్లా పరిషత్ పాఠశాలలో బేటీ బచావ్– బేటీ పడావ్ కార్యక్రమంలో భాగంగా బాలికలకు హక్కులపై అవగాహన కల్పించారు. చిన్నతనంలోనే వివాహాలు చేసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు.

**బుల్లెట్ దర్జాకు ప్రతీక.** కేటీఎం బైకు కుర్రకారుకు క్రేజ్. పాతబడ్డ యమహా, ఆర్ఎక్స్ 100 వాహనాలకు రంగులు అద్ది రోడ్లపై తిప్పుతున్నారు. అయితే వీటిలో అధిక శాతం అటు పర్యావరణానికి, ఇటు ప్రజలకు నష్టం కలిగించేవే. ఈ వాహనాల సైలెన్సర్‌లలో కొద్దిపాటి మార్పు చేస్తే అది వెలువరించే శబ్దం ప్రత్యేకం. ఎదుటివారి ఇబ్బందులను పట్టించుకోకుండా రోడ్లపై దూసుకెళ్తుండటం ఇబ్బందికరంగా మారుతోంది. నిబంధనలకు అనుగుణంగా ప్రతి మోటార్ వాహనం నిర్ణీత డెసిబుల్స్ శబ్దాన్ని వెలువరించేలా సైలెన్సర్‌లను తీర్చిదిద్దుతారు. అలాంటి డిజైన్‌లకే రవాణా శాఖ అనుమతిస్తోంది, మనిషి సాధారణంగా 60 డెసిబుల్స్ శబ్దం వరకు వినగలడు. అంతకు మించిన శబ్దం వింటే కర్ణభేరిపై ప్రభావం చూపి వినికిడి లోపం ఏర్పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.



బుల్లెట్ బైకుకు కంపెనీ సైలెన్సర్ కాకుండా అధిక శబ్దం చేసే సైలెన్సర్‌ను అమర్చిన దృశ్యం

# సైలెన్సర్ మార్చి.. సౌండ్ పెంచి

- సరికొత్త సైలెన్సర్‌లతో శబ్ద కాలుష్యం
- మెకానిక్‌లను ఆశ్రయించి ఎడాపెడా మార్పు
- రోడ్లపై వింత శబ్దాలతో దడ పుట్టిస్తున్న కుర్రకారు

ఆదోని అర్బన్ : ఈ మధ్య రోడ్డుపై మితిమీరిన వేగంతో పాటు చెవులకు చిల్లుపడే శబ్దంతో వెళ్తున్న ద్విచక్ర వాహనాలు అధికమయ్యాయి. ఇందులో యమహా నుంచి బుల్లెట్, కేటీఎం వంటి రైసింగ్ బైకులు ఉన్నాయి. కంపెనీ నుంచి కొనేటప్పుడు వాహనాలకు ఉన్న సైలెన్సర్‌లను తొలగించి ఆ స్థానంలో వారికి నచ్చిన శబ్దాన్ని వెలువరించే గొట్టాలను అమరుస్తున్నారు. ఈ బైకులు చేసే శబ్దంతో రోడ్డుపై వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో 8 ద్విచక్ర వాహనాల షోరూంలు, రెండు ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాల షోరూంలు ఉన్నాయి. దాదాపుగా 40 మందికి పైగా ద్విచక్ర వాహనాల మెకానిక్‌లు ఉన్నారు.

#### అధిక శబ్దాన్ని ఇచ్చే సైలెన్సర్‌లు ఇవే..

సరికొత్త లైసెన్సర్‌ల నుంచి వచ్చే శబ్దానికి యువత ఆకర్షితులవుతున్నారు. కొత్త వాహనాలు తీసుకున్న వెంటనే అధిక శబ్దం వచ్చే వైల్డ్‌బోర్, కాక్‌టైల్ ఫార్మర్, డాల్ఫిన్, మెగాఫోన్, ఆక్రాపోవిట్, డీపీ డైరెక్ట్ సైలెన్సర్లను ఏర్పాటు చేయించుకుంటున్నారు. అలాగే బుల్లెట్ బైకులకు ఇండోర్, పంజాబ్స్ సైలెన్సర్‌లను అధికంగా వాడుతున్నారని మెకానిక్‌లు చెబుతున్నారు. ఈ సైలెన్సర్‌ల ధర అధికం. అలాగే శబ్దం కూడా భయంకరంగా ఉంటుంది. వీటిని వాడటం చట్టవిరుద్ధంగా ప్రభుత్వం ప్రకటించింది. ఇలాంటి వాటిని ఏర్పాటు చేసుకున్న వారు పట్టుబడితే అపరాధం. తీరు మారకుంటే శిక్ష ఖాయమంటున్నారు ఆర్టీఓ, ట్రాఫిక్ పోలీసు అధికారులు.

#### శబ్ద కాలుష్యం నేరం



వాహనం నిర్ణీత డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దకాలుష్యం సృష్టిస్తే అది మోటార్ వాహనాల చట్టం ప్రకారం నేరం. నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యాన్ని సృష్టించే వాహనంపై ఎంవీఐ యాక్ట్ 1988 సెక్షన్ 190(2) ప్రకారం పోలీసులతో పాటు రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేయవచ్చు. సంబంధిత వాహనచోదకుడికి రూ. వెయ్యి జరిమానాతో పాటు కేసు నమోదు చేస్తాం. రెండోసారి శబ్ద కాలుష్యానికి కారణమైతే రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు జరిమానా విధిస్తారు. మోటార్ వాహనానికి కంపెనీ ఇచ్చిన భాగాలను కాదని, ఇతర భాగాలను అమరిస్తే ఎంవీఐ యాక్ట్ 1988 సెక్షన్ 191 ప్రకారం కేసు పెట్టవచ్చు. కొందరు కంపెనీ లైసెన్సర్‌లు తీసివేస్తుంటే మరికొందరు ఫిల్టర్‌లను తీసి వేస్తున్నారు. దీనివల్ల శబ్ద తీవ్రత పెరుగుతోంది.

– శివారెడ్డి, ఆదోని ఆర్టీఓ

#### శబ్దం పెరిగేకొద్దీ ఇబ్బందే



వంద డెసిబుల్స్ దాటితే గుండెజబ్బులున్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అంత కంటే శబ్దం పెరిగే కొద్దీ కొందరిలో చికాకు, కోపంతో భరించలేని తలనొప్పి, వణుకు, చెవులోని వినికిడి కణాలు, నరాలు దెబ్బతిని, పాక్షిక వైకల్యం ఏర్పడుతుంది. అంతేగాకుండా కర్ణభేరి పగిలిపోవడమేగా కుండా వినికిడి శక్తిని పూర్తిగా కోల్పోతారు. వృద్ధులు ఆ శబ్దం విని మానసిక స్థితి మారిపోయే అవకాశముంది. ట్రాఫిక్, ఆర్టీఓ అధికారులు ఈ సైలెన్సర్‌ల నిరోధంపై ప్రత్యేక చొరవ చూపాలి.

– డాక్టర్ గోపీనాథ్, వైద్యుడు

#### చర్యలు చేపడుతున్నాం



ప్రతి రోజూ ఐదారు బైకులు తనిఖీలో పట్టుబడితే మెకానిక్ ద్వారా మార్పు చేస్తున్నాం. వేరే చోట పట్టుబడితే వారికి రెండు రోజులు సమయం ఇచ్చి సెల్‌ఫోన్, వాహన నంబర్ తీసుకుంటున్నాం. ఒక వేళ సైలెన్సర్‌ను మార్పు చేయకుంటే చర్యలు తీసుకుంటాం. అధిక శబ్ద కాలుష్యం వల్ల వృద్ధులు, అనారోగ్యం ఉన్న వారికి ఎంతో ఇబ్బందిగా ఉంటుంది.

– పార్థసారథి, ట్రాఫిక్ సీఐ

# అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో రణమండల ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్ : పట్టణంలో అమావాస్య సందర్భంగా శనివారం ఆయా శైవ, వైష్ణవ ఆలయాల్లో ఘనంగా పూజలు జరిగాయి. రణమండల కొండలో వెలిసిన రణమండల ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీ హారం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళ హారతి తదితర పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

కౌతాళం: స్థానికంగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో శనివారం భక్తులు పూజలు చేశారు. శనివారం అమావాస్య కావడంతో దర్గా, మసీదు ఆవరణలోనే నమాజులు ఆచారించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. పలువురు భక్తులు పిండి వంటలు వండి స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి.

### ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

ఆదోని రూరల్ : జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య కోరారు. శనివారం పట్టణంలోని సీఆర్ కాలనీ, కల్లుబావి, అమరావతి నగర్ తదితర ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిడ్డయ్య పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూఈనెల 30న లబ్ధిదారులతో మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. పట్టణ సహాయ కార్యదర్శి విజయ, నాయకుడు కొత్తూరు ఈరన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు గిరిమల్లప్ప పాల్గొన్నారు.